దబాయింపులతో దారిమళ్లింపు

- సజావుగా సాగుతున్న సభలో సీఎం అనుచిత వ్యాఖ్యలా?
- డిప్యూటీ సీఎం మరింత ఆజ్యం పోశారని ఆరోపణ
- సమాధానం చెప్పలేక దొడ్డిదారిని ఎంచుకున్న సర్కార్: బీఆర్ఎస్



హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వ్యక్తిగత దూషణలకు, దారిమళ్లింపు రాజకీయాలకు వేదికగా మారుతున్నాయా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే అంటున్నాయి. ఈసారి బడ్జెట్ సమావేశాలు, బుధవారం సభావేదికగా చోటుచేసుకున్న పరిణామాలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు ఉదహరిస్తున్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై మాజీమంత్రి కేటీఆర్ చేసిన సుదీర్ఘ ప్రసంగంలో, ఆయన లేవనెత్తిన అంశాలపై తమ దగ్గర సరైన సమాధానం లేక సీఎం రేవంత్‌రెడ్డి తప్పించుకునేందుకు దారిమళ్లింపు రాజకీయ చర్యలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ విమర్శిస్తున్నది. సీఎం రాజేసిన నిప్పుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నీళ్లు చల్లాల్సిందిపోయి మరింత రాజుకునేందుకు ఉప్పు వేశారని స్వయంగా కాంగ్రెస్ నేతలే గుసగుసలాడుతున్నారు.

సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచీ..

బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఇప్పటికే బీఆర్ఎస్ విమర్శిస్తున్నది. బుధవారం ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా కేటీఆర్ సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లపాటు బీఆర్ఎస్ సర్కార్ ఆయా రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటి ఫలితాలను సభలో ప్రస్తావించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు ఏ మేరకు నష్టం చేస్తాయో, వాటి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చేసిన వాగ్దానాన్ని గుర్తుచేస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఫార్మా సిటీ కోసం రైతుల దగ్గరి నుంచి సేకరించిన భూములను తిరిగి ఇస్తారా? అని ప్రశ్నించారు. ఈ అంశాల పరంపర కొనసాగుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సభలో దుమారాన్ని రేపాయి. వీటికితోడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు, మోటర్లపై మీటర్లు, పులిచింతల ప్రాజెక్టుల తదితర విషయాల్లో సీఎం సభను ఉద్దేశపూర్వకంగానే తప్పుదారి పట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించిన విషయం తెలిసిందే.

హుందాతనంతో కేటీఆర్.. భేషజంతో రేవంత్

కేటీఆర్ హుందాతనంతో వ్యవహరించారని, అదే సీఎం రేవంత్‌రెడ్డి భేషజాలకు పోతున్నారని స్వయంగా కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యేలే వాపోతున్నారు. కేటీఆర్ ప్రసంగంలో రేవంత్.. అని ఒక దశలో సంభోదించారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తప్పుబట్టారు. ఒక దశలో స్పీకర్ సైతం సభానాయకుడిని ఏకవచనంతో సంభోదించకూడదని అన్నారు. దీంతో కేటీఆర్ గతంలో తనకున్న చనువుతో అలా అన్నానని, ఒకవేళ తన మాటలు సరికాదని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గుర్తుచేస్తూనే సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై పెదవి విరుస్తున్నారు. సభానాయకుడిగా సీఎం హుందాగా వ్యవహరించాల్సిందిపోయి అసందర్భోచితంగా వివాదాలకు కారణం అవుతున్నారని పేర్కొంటున్నారు.

బెడిసికొట్టిన వ్యూహం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన జరుగుతుండగానే ద్రవ్య వినిమయ బిల్లును సభ ఆమోదించింది. చర్చలో ఎంఐఎం, బీజేపీ, సీపీఐ తమ అభిప్రాయం వెల్లడించకుండానే, అధికార పక్షం నుంచి ఎటువంటి క్లారిఫికేషన్స్ లేకుండానే ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం వాయువేగంతో జరిగిపోయింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి నినాదాలు చేస్తూ మీడియా పాయింట్ వద్ద సర్కారు తీరును మీడియాకు వివరించే అవకాశం ఉందని గ్రహించిన అధికారపక్షం నేతలు.. మీడియా పాయింట్ వద్ద ప్రసంగించటం మొదలుపెట్టారు. ప్రభుత్వం వ్యూహాత్మకంగా మూడు వేర్వేరు బృందాల్లో ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు జీ మధుసూదన్‌రెడ్డి, కే శంకరయ్య, బాలునాయక్, విజయరమణారావు, యశస్వినీరెడ్డి, మట్టా రాగమయి, చిట్టెం పర్ణికారెడ్డి, కుంభం అనిల్‌కుమార్, వాకిటి శ్రీహరి, మందుల సామేలు తదితరులు మీడియా పాయింట్‌లో ప్రసంగించారు. అయితే, కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద సహా పలువురు ఎమ్మెల్యేలు మీడియా పాయింట్ ఆవరణలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యేల వద్దనున్న కెమెరాలు బీఆర్ఎస్ తిరగటం గమనార్హం. దీంతో మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాట్లాడించొద్దనే కాంగ్రెస్ వ్యూహం బెడిసి కొట్టిందనే గుసగుసలు వినిపించాయి.

అప్పుడు మీరెక్కడున్నరు?

- మిమ్మల్ని కాంగ్రెస్‌లోకి తీసుకొస్తే మమ్మల్నే ఇబ్బంది పెట్టారు
- మా కుటుంబాన్ని రాజకీయ సమాధి చేయాలని చూశారు
- మాటసాయం కోరితే నా గుండెకు మానని గాయం చేశారు: కార్తీక్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ) : 'ఎవరు ఎవర్ని మోసం చేశారు.. ఎవరివల్ల ఎవరికి లాభం జరిగిందనేది ఆ దేవుడికి తెలుసు. 2019లో మిమ్మల్ని వదిలి పార్టీ మారామనేది మీ బాధయితే, మిమ్మల్ని కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చామన్న అక్కసుతో ఆ పార్టీలోని కొందరు పెద్దలు నన్ను, మా అమ్మను నానా ఇబ్బందులు పెడుతున్నప్పుడు, మా కుటుంబాన్ని రాజకీయ సమాధి చేయాలని ప్రయత్నించినప్పుడు మీరెక్కడున్నారు అన్నా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'అందరికీ రేవంత్ మా అన్న' అని చెప్పుకున్న. మాకు అండగా ఉండాల్సిన సమయంలో అనాథగా వదిలి వెళ్లింది మీరు కాదా? 2018లో నా రాజకీయ భవిష్యత్తు కోసం మాటసాయం చేయాలని వేడుకుంటే 'నా చేతిలో ఏముంది' అని చెప్పి నా గుండెకు మానని గాయం చేసింది మీరు కాదా?' అని నిలదీశారు. పార్టీలు మారినా రేవంత్‌రెడ్డి ఎప్పుడూ బాగుండాలని కోరుకున్నామే తప్ప తన నాశనాన్ని కోరలేదని, రేవంత్‌రెడ్డికి కలిగిన బాధకంటే రెట్టింపు బాధ తమకు కలిగిందని కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు.

అహంకారానికి నిదర్శనం: గజ్జెల నగేశ్

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్ విమర్శించారు.

ఓయూ విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి మల్లు దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు

సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలి • బాలాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన • ఓయూలో విద్యార్థుల ఆగ్రహం

బడంగ్‌పేట/ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31 : 'మహిళలను అవమానించడం మంచి పద్ధతి కాదు.. మహిళల ఆగ్రహానికి సీఎం, డిప్యూటీ సీఎం గురికాక తప్పదు.. వారిద్దరూ మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని బీఆర్ఎస్ శ్రేణులు, ఓయూలో విద్యార్థులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు బుధవారం రాత్రి ఆందోళన చేశారు. బాలాపూర్‌లో బీఆర్ఎస్ నేత అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఓయూలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేశారు. విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలాపూర్ వద్ద ఆందోళనలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, కార్పొరేటర్లు అనిల్ కుమార్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, భూపేశ్‌గౌడ్, విజయలక్ష్మి, యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, సురభి లత, మాధవి, గోపీ యాదవ్, బషీర్, నాగరాజు, జంగయ్య, మ హేందర్, వెంకటేశ్, ఓయూలో బీఆర్ఎస్వీ నాయకులు శిగ వెంకటేశ్‌గౌడ్, జంగయ్య, నాగేందర్, అవినాశ్, శ్రీకాంత్, రామకృష్ణ, పవన్, సాయి, రాహుల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వాకౌట్

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రతిపక్ష మహిళా సభ్యులను అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శాసనమండలిలో చర్చించాలని బుధవారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. చర్చకు అనుమతించకపోవడంతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తీరును నిరసిస్తూ వాకౌట్ చేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ తరపున మధుసూదనాచారి, సురభివాణిదేవి, మహమూద్‌అలీ, శంభీపూర్‌రాజు మండలిలో నిరసన తెలిపారు. అసెంబ్లీ అంశంపై చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చర్చకు అనుమతి ఇవ్వలేదు.బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపుతున్న క్రమంలోనే చైర్మన్ అనుమతితో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించారు. ద్రవ్య వినిమయ బిల్లు ప్రవేశ పెట్టిన నేపథ్యంలో చర్చలకు అనుమతి ఇవ్వలేదన్న అంశంపైనా నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లుకు మూజువాణి ఓటుతో ఆమోదం లభించింది. వెంటనే మండలి సమావేశాలను ఆగస్టు 1కి వాయిదా వేస్తూ చైర్మన్ ప్రకటించారు.

అసెంబ్లీలో అవమానాలు.. బయట అఘాయిత్యాలు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో మహిళలకు గౌరవం, భద్రత లేదని తెలంగాణ పుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ విమర్శించారు. అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలకు అవమానం, బయట మహిళలపై అఘాయిత్యాలు కాంగ్రెస్ పాలనకే చెల్లాయని పేర్కొన్నారు. యావత్ తెలంగాణ మహిళా లోకాన్ని అవమానించేలా అసెంబ్లీలో మంత్రులు మాట్లాడారన్నారు. మహిళా ఎమ్మెల్యేలకు సీఎం, మంత్రులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దురహంకారానికి నిదర్శనం: దశరథ్

అసెంబ్లీలో సబితాఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ పేర్కొన్నారు. శాసనసభ సంస్కృతికి మచ్చతెచ్చేలా రేవంత్ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. సీనియర్ ఎమ్మెల్యే పై సీఎం మాటలు ఆయన దురహంకారానికి నిదర్శనమని చెప్పారు. మూలాలు మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు.

సీఎం సమాధానం లేకుండానే ద్రవ్య వినిమయ బిల్లు పాస్

- నిరసనల మధ్యనే శాసనసభ ఆమోదం
- ఎంఐఎం, బీజేపీ, సీపీఐకి అవకాశమివ్వకుండానే..
- అంతా 30 నిమిషాల్లోనే పూర్తి

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి సమాధానం లేకుండానే ద్రవ్య వినిమయ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. సీఎం సమాధానం లేకుండా ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడం ఇదే మొదటిసారి అని చెప్తున్నారు. విరామం అనంతరం బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సభ పునఃప్రారంభంకాగానే బీఆర్ఎస్ మహిళా సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా లేచి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నిరసనల మధ్యనే ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చను స్పీకర్ చేపట్టారు. బిల్లుపై మాట్లాడాలని బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డికి మైక్ ఇచ్చారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతుండగా బీఆర్ఎస్ నేతలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభను ఆర్డర్‌లో పెట్టాలని కోరుతూ మహేశ్వర్‌రెడ్డి తన ప్రసంగాన్ని ఆపారు. స్పీకర్ మాత్రం మైక్‌ను ఎంఐఎం, సీపీఐ ఎమ్మెల్యేకు ఇవ్వకుండా కాంగ్రెస్ సభ్యుడు వివేక్‌కు అవకాశమిచ్చారు. దీంతో ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మరోసారి లేచి అతిముఖ్యమైన ద్రవ్య వినిమయ బిల్లుపై మాట్లాడే అవకాశం కల్పించాలని, బీజేపీ, సీపీఐ కూడా మాట్లాడాల్సి ఉన్నదని డిమాండ్ చేశారు. అయితే, స్పీకర్ వారెవరికీ అవకాశం ఇవ్వకుండా వివేక్‌కు మైక్ ఇచ్చారు. బీఆర్ఎస్ నిరసనల మధ్యనే మాట్లాడిన వివేక్.. సభను ఆర్డర్‌లో పెట్టాలంటూ ప్రసంగం ఆపి సీట్లో కూర్చున్నారు. తదుపరి ఎవరికీ అవకాశం ఇవ్వకుండానే బిల్లుపై చర్చ ముగిసిందని స్పీకర్ ప్రకటించారు. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యేలు సైతం లేచి నిలబడి నిరసన వ్యక్తంచేశారు. స్పీకర్ ఆవేవీ పట్టించుకోకుండా సభ ఆమోదానికి ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు సూచించారు. దీంతో ఆయన బిల్లును ప్రవేశపెట్టగా, ఆమోదం పొందినట్టు స్పీకర్ ప్రకటించారు. ఆ వెంటనే సభను గురువారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు. విరామం అనంతరం అంతా 30 నిమిషాల్లోనే సభను ముగించడం గమనార్హం.

సీపీఐ వాయిదా తీర్మానం తిరస్కరణ

ఖమ్మం, నల్లగొండ, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్, పరకాల తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ఇండ్ల పట్టాలు పంపిణీ తదితర సమస్యలపై చర్చించాలని కోరుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం అందజేశారు. ఆ తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించారు.

సీఎం మాట.. కేటీఆర్ తూటా

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలుసార్లు ఢీ అంటే ఢీ అంటూ మాటల బాణాలు విసురుకున్నారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అంటే ఘాటుగా స్పందించారు కేటీఆర్. వారి సంభాషణలోని ముఖ్యాంశాలు

సీఎం: మా ప్రభుత్వం స్పోర్ట్స్, అగ్రికల్చర్, ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్, ఎనర్జీ పాలసీలను తీసుకొస్తుంది.

కేటీఆర్: ప్రభుత్వం అనేక పాలసీలు తీసుకొస్తం అంటుంది. కానీ ఇప్పటివరకు కేసీఆర్‌పై జెలసీ తప్ప ఏ పాలసీ లేదు.

సీఎం: ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతిస్తామంటున్న బీఆర్ఎస్.. నేడు నిర్వహించే స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలి.

కేటీఆర్: కచ్చితంగా ప్రభుత్వం నిర్వహించే మంచి కార్యక్రమాలకు 100% మద్దతు ఇస్తాం. సీఎం మమ్మల్ని రావాలని అడిగారు. ప్రొటోకాల్ పాటిస్తే కచ్చితంగా వస్తాం. ఓడినవాళ్లను వేదికపై కూర్చోబెట్టి.. గెలిచిన వాళ్లను కింద కూర్చోబెడతామంటే కుదరదు. సబితమ్మను కూడా పిలిచి.. గౌరవం ఇవ్వండి.

సీఎం: నేను గుంటూరుకెళ్లి చదువుకోలేదు, గవర్నమెంట్ స్కూళ్లో చదువుకున్నాను. ముల్కీ రూల్స్, 610, ఏ రూల్ అప్లై చేసినా తెలంగాణలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగానికి నాకు అర్హత ఉన్నది. గుంటూరులో చదువుకున్నవారికి అర్హత ఉన్నదో లేదో స్పీకర్ చెప్పాలి.

కేటీఆర్: నేను గుంటూరులో ఇంటర్ చదివిన. విజ్ఞాన్, రత్తయ్య కాలేజీలో చదివిన. ఇందులో నేనేమీ దాచడం లేదు. నేను గవర్నమెంట్ ఉద్యోగానికి దరఖాస్తు చేయలేదు. ప్రైవేటు రంగంలో ఉద్యోగం సంపాదించుకున్న, చేసిన. ప్రైవేటు రంగంలో 610 జీవో వర్తించదు. సీఎం రేవంత్‌రెడ్డి ఇది తెలుసుకుంటే బాగుంటుంది.

సీఎం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై చర్చ సందర్భంగా ఓ వ్యక్తి కేటీఆర్ గురించి ఒక విషయం చెప్పారు. ఏ అంటే 100% ఆర్టిఫిషియల్, ఐ అంటే జీరో పర్సంట్ ఇంటెలిజెన్స్.

కేటీఆర్: మా నాన్నగారు నన్ను చదివించారు. రెండు మాస్టర్ డిగ్రీలు చేసిన. పూణెలో బయోటెక్నాలజీలో మాస్టర్స్, ఆ తర్వాత న్యూయార్క్‌లో ఎంబీఏ చేసిన. అంతో ఇంతో చదువుకున్న. ఉద్యోగం చేసిన. నేను చదువుకున్నా కాబట్టి సర్టిఫికెట్లు చూపెట్టగలను. ఉద్యోగం సంపాదించినా, అదే ఉద్యోగంపై ఇండియాకు వచ్చిన. కానీ వారు (సీఎంను ఉద్దేశించి) ఎక్కడ చదువుకున్నారో తెలియదు, ఏం చదువుకున్నారో తెలియదు. నాకు ఇంటెలిజెన్స్ ఉన్నదా అంటే.. నేను పోటీ పరీక్షలు రాసిన. జీవితంలో ఇంటర్వ్యూలు అటెండయ్యా. కానీ సీఎం గతమేందో నాకు తెలియదు. బయట రకరకాలుగా చెప్తుంటారు. ఎవరి ఇంటెలిజెన్స్ ఏమిటో ప్రజలు తేలుస్తారు.

రాష్ట్రంలో లైంగికదాడులు పెరుగుతున్నాయి

- 24గంటల్లో మూడు ఘటనలు దురదృష్టకరం
- దోషులపై కఠిన చర్యలకు సత్యవతిరాథోడ్ డిమాండ్

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయాయని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం శాసనమండలి సమావేశాలు ప్రారంభమైన వెంటనే సభ్యులకు ప్రత్యేక అంశాలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలపై దాడులపై చర్చ జరిగిన 24 గంటల్లోనే నగరంలో మూడు ఘటనలు జరుగడం దురదృష్టకరమన్నారు. మహిళల మీద దాడులు జరుగుతున్నా ప్రభుత్వం, మంత్రుల నుంచి ఎలాంటి స్పందనలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో హోంమంత్రి లేడని, ఆ శాఖ సీఎం దగ్గర ఉన్నందున శాంతిభద్రతలపై పక్కబ్దుందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. లైంగిక దాడుల దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు డాక్టర్ యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, వాణీదేవి, తాతా మధు, రవీందర్‌రావు, యెగ్గే మల్లేశం, ఎల్ రమణ, నవీన్ రెడ్డి, మహమూద్ అలీ, బీజేపీ సభ్యుడు ఏవీఎన్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు బేగ్ కొన్ని అంశాలను సభలో ప్రస్తావించగా మంత్రి తుమ్మల నోట్ చేసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు శేరి సుభాష్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిటిషన్‌ను ఇచ్చారు. టీ విరామం కోసం వాయిదా పడిన సభ తిరిగి మధ్యాహ్నం ప్రారంభం కాగా ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ జరిగింది.

సీఎం.. బుజ్జగింపుల పర్వం

- మాజీ స్పీకర్ పోచారం ఇంటికి వెళ్లిన రేవంత్
- పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో భేటీ
- హాజరుకాని బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



పోచారంను కలిసిన సీఎం రేవంత్(ఫైల్)

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరేందుకు సిద్ధం కావడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని గుర్తించి బుజ్జగింపుల పర్వం మొదలు పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయనతోపాటు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా వెళ్లినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వారు భేటీ అయినట్టు తెలుస్తున్నది. ఈ సమావేశానికి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మినహా మిగతా ఎమ్మెల్యేలంతా హాజరైనట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరే వరకు తమతో సంప్రదింపులు జరిపి, ఆ తర్వాత తమను గాలికి వదిలేశారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఓ సీనియర్ ఎమ్మెల్యే ఏకంగా మూడుసార్లు సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని చెప్తున్నారు. చేరేముందు తనకు మంచి పదవి ఇస్తామని ఆశపెట్టి.. ఇప్పుడు కనీసం కలవకపోవం ఏమిటని ఆయన సన్నిహితుల వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకే మంత్రి పదవులు అని సీఎం స్పష్టంగా చెప్పడంతో మిగతా ఎమ్మెల్యేల ఆశలు ఆవిరయ్యాయి. మరోవైపు తమను రాష్ట్ర, స్థానిక కాంగ్రెస్ నేతలు, ఇతర ఎమ్మెల్యేలు కలుపుకోవడం లేదంటూ వారు అసంతృప్తిలో ఉన్నారని తెలుస్తున్నది. అందుకే వారు అసెంబ్లీలో కూడా అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారని, ఒంటరిగా వచ్చిపోతున్నారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో 'మాకు బీఆర్ఎస్‌లో ఉంటే అయినా గౌరవం ఉండేది' అని సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. వారి అసంతృప్తి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రూపంలో బయటపడింది. రెండు రోజుల కిందట అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసి.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని బండ్ల చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో ఏం జరుగుతున్నదంటూ అధిష్ఠానం ఆరా తీయడంతో రేవంత్‌రెడ్డి అప్రమత్తమైనట్టు చెప్తున్నారు. దీపాదాస్ మున్షీ రంగంలోకి దిగి, సీఎంతో కలిసి పోచారం ఇంటికి వెళ్లి బుజ్జగింపులు జరిపినట్టు సమాచారం.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీ మేరకు బీసీ-బీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలి. జనగణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి. సుప్రీంకోర్టులో ఉన్నదని ప్రభుత్వం దాటవేస్తున్నది.

- ఎమ్మెల్సీ తాతా మధు

పీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో డయాలసిస్ రోగుల సంఖ్య పెరిగింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 3 డయాలసిస్ కేంద్రాలు ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి సంఖ్యను 104కి పెంచింది. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు నిలిచిపోవడంతో రాష్ట్రంలో సిజేరియన్ కాన్పుల సంఖ్య పెరిగింది. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, కంటి వెలుగు కొనసాగించాలి.

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

సింగూరు జలాలను సరఫరా చేయాలి

ఉమ్మడి మెదక్ జిల్లాకు సింగూరు జలా